

విద్యకు చిన్నారులు దూరం

ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలకు
నోచుకోని కాజీపల్లి కాలనీ
గ్రామానికి 3 కిలోమీటర్ల దూరంలో కాలనీ
వెయ్యికి పైగా నివాసాలు.. వందల్లో చిన్నారులు
గతేడాది పరిశీలించిన కలెక్టర్, డీఈవోలు
పాఠశాల ఏర్పాటుకు ఎకరా స్థలం
కేటాయించేందుకు ప్రతిపాదనలు
నేటికీ మంజూరు కాని స్థలం
7

విత్తనోత్పత్తికి ప్రోత్సాహం

ఊరూరా ఉత్సాహంగా
'నాణ్యమైన విత్తనం-రైతన్నకు నేస్తం'
రైతులకు మూల విత్తనాల అందజేత
7



పాపన్నపేట మండలం మల్లంపేట గ్రామంలో రైతులకు విత్తనాలను పంపిణీ చేస్తున్న అధికారులు

మతసామరస్యంతో

బక్రీద్‌ను జరుపుకోవాలి

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్
సోషల్ మీడియాలో వచ్చే వార్తల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
ఇన్‌చార్జి ఎస్పీ రాజేష్‌చంద్ర
8

కుటుంబ కలహాలతో

దంపతుల ఆత్మహత్య

..మరో ఘటనలో యువకుడు
7

భూ భారతి రైతులకు వరం లాంటిది

● టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి ● ఇస్మాయిల్‌ఖాన్‌పేటలో జరిగిన రైతు సదస్సులో పాల్గొన్న నిర్మలా జగ్గారెడ్డి





ఇస్మాయిల్‌ఖాన్‌పేటలో నిర్మలా జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు, మాట్లాడుతున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూ భారతి రైతులకు వరంగా మారబోతున్నదని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పేర్కొన్నారు. సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖాన్‌పేటలో మంగళవారం జరిగిన భూ భారతి చట్టం గ్రామ రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. ధరణి పేరిట రైతుల భూ హక్కులను కాలరాసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నదన్నారు. ప్రతీ ఒక్కరు భూ భారతి సదస్సులను సద్వినియోగం చేసుకుని భూ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంగారెడ్డికలెక్టర్ వల్లూరు క్రాంతి, రెవెన్యూ అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



నర్సాపూర్‌లో ఓ రేషన్ దుకాణం

రేషన్.. పరేషాన్

మూడు నెలలు.. ముప్పు తిప్పలు

ఒక్కో కార్డుకు ఆరు సార్లు వేలిముద్ర
సర్వర్ మొరాయింపు..
గంటల తరబడి నిరీక్షణ
రోజుకు వంద మందికే బియ్యం..!

నర్సాపూర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రేషన్ లబ్ధిదారులకు సన్నబియ్యం అందజేయాలని నిర్ణయించిన ప్రభుత్వం, మూడు నెలల కోటా ఒకే సారి అందజేస్తున్నది. కానీ, బియ్యం తీసుకోవడానికి లబ్ధిదారులకు పాట్లు తప్పడం లేదు. రేషన్‌కార్డుపై సభ్యులకు ప్రతీ నెల కేంద్ర ప్రభుత్వం ఐదు కిలోలు, రాష్ట్ర ప్రభుత్వం కిలో చొప్పున బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఈ నెల నుంచి సన్నబియ్యం పంపిణీ చేస్తామని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం, మూడు నెలల బియ్యం ఒకే సారి ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన బియ్యం పంపిణీ ప్రారంభించారు. ప్రతీ నెల షాపుల చుట్టూ తిరగాల్సిన పని లేకుండా ఒకే సారి రేషన్ బియ్యం అందించడం సంతోషంగానే ఉన్నా.. సాంకేతిక సమస్యలతో లబ్ధిదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రతీ నెల రేషన్‌కార్డులో నమోదైన సభ్యుల్లో ఎవరో ఒకరు చౌకధరల దుకాణానికి వచ్చి ఈ-పోస్ మిషన్‌లో వేలిముద్ర నమోదు చేస్తేనే బియ్యం ఇస్తారు. కేంద్ర ప్రభుత్వ కోటాకు సంబంధించి ఒకసారి, రాష్ట్ర ప్రభుత్వ కోటాకు సంబంధించి ఒకసారి.. ఇలా రెండుసార్లు వెలిముద్ర వేయాల్సి ఉంటుంది. ఈమేరకు మూడు నెలల రేషన్ కోసం ఆరు సార్లు వేలిముద్ర నమోదు చేయిస్తున్నారు. దీనికి చాలా సమయం పడుతున్నది.

మిగతా 8వ పేజీలో

ట్రేడింగ్ మాయ

సంగారెడ్డి పట్టణానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఎం.శ్రీనివాస్‌రెడ్డికి ఓ ఫోన్ కాల్ వచ్చింది. ట్రేడింగ్ చేయడానికి టిప్స్ చెబుతాం, రూ.10వేలు పెట్టుబడి పెడితే రోజుకు రూ.10వేలు లాభం ఇప్పిస్తామంటూ ఫోన్‌లో ఓ మహిళ మాట్లాడి మాయలో పడేసింది. దీంతో, శ్రీనివాస్‌రెడ్డి ఓ బ్రోకరేజీ ఖాతాలో రూ.20వేలు జమ చేశాడు. తొలి రోజు రూ.2వేలు లాభం వచ్చినట్లు చూపించడంతో అదే ఖాతాలో మరో రూ.30వేలు డిపాజిట్ చేశాడు. మరో ఖాతాకు ఫోన్‌పే ద్వారా రూ.5వేలు ట్రాన్స్‌ఫర్ చేశాడు. మరుసటి రోజు రూ.20వేలు నష్టం వచ్చినట్లు చూపించిన సదరు మహిళ.. రూ.15వేలు తన బ్యాంకు ఖాతాకు ట్రాన్స్‌ఫర్ చేయించుకుంది. ఆ తరువాత రోజు నుంచి దశలవారీగా రూ.50వేలు నష్టం వచ్చినట్లు చూపించారు. దీనికితోడు బ్యాంకు ఖాతా నుంచి రూ.20వేలు పోగొట్టుకున్నాడు. ఇలా అనేక మంది అత్యాశపరులు, అమాయకులు ట్రేడింగ్ మాయలో పడి లక్షల రూపాయలు పోగొట్టుకుంటున్నారు.

అధిక లాభాల ఆశతో టోకరా

వేలల్లో పెట్టుబడి పెడితే లక్షల్లో ఆర్జన అంటూ ఎర
డబ్బు మీది.. సలహాలు మావి అంటూ భరోసా
టెలీగ్రామ్, వాట్సాప్ గ్రూపుల ద్వారా పరిచయం
రూ.10వేల పెట్టుబడితో రూ.లక్ష వస్తుందని ప్రచారం
సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, వ్యాపారులే టార్గెట్
రూ.లక్షలు పోగొట్టుకుంటున్న అమాయకులు



సంగారెడ్డి క్రైం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సైబర్ మోసగాళ్లు ఎప్పటికప్పుడు సరికొత్త మోసాలతో అమాయకులను ముంచేస్తున్నారు. ఇటీవల ట్రేడింగ్ పేరిట కొత్త మోసానికి తెర తీశారు. ప్రతి రోజూ రూ. వేలల్లో లాభాలు వస్తాయని నమ్మిస్తున్నారు. వాట్సాప్, టెలీగ్రామ్ యాప్‌లలో ట్రేడింగ్ గ్రూపులు ఏర్పాటుచేసి, ఉచిత ట్రేడింగ్ చిట్కాలంటూ ఫోన్ నంబర్లను యాడ్ చేస్తున్నారు. మీరు ఉద్యోగం చేస్తున్నా పర్వాలేదు, పెట్టుబడి పెడితే చాలు మేమే ట్రేడింగ్ చేసి రూ.లక్షల్లో లాభాలు తెప్పిస్తామని నమ్మిస్తున్నారు. మొదట్లో చిన్న మొత్తాల్లో లాభాలు చూపించి, భారీ మొత్తాలు వసూలు చేశాక జెండా ఎత్తేస్తున్నారు.

అమాయకులకు వల

ఇటీవల ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, వ్యాపారులతో పాటు యువత కూడా స్టాక్ మార్కెట్ వైపు మొగ్గుచూపుతున్నారు. నాలుగేళ్ల క్రితం లక్షల్లో ఉన్న డిమ్యాట్ ఖాతాలు ప్రస్తుతం కోట్లకు చేరుకున్నాయి. స్టాక్ మార్కెట్ గురించి ఏమీ తెలియని వారు కూడా షేర్లలో పెట్టుబడులు పెడుతున్నారు. ట్రేడింగ్ బ్రోకరేజీ ఖాతాల ద్వారా ఫోన్ నంబర్లు సంపాదించిన కేటగాళ్లు అమాయకులను వలలో పడేస్తున్నారు. లాభాలు తెచ్చి పెడతామని నమ్మబలుకుతున్నారు. కొద్దికొద్దిగా లాభాలు చూపించి అమాయకుల ట్రేడింగ్ ఖాతాలను ఖాళీ చేయిస్తూ తమ వ్యక్తిగత ఖాతాలకు డబ్బును మళ్లించుకుంటారు.

రూ.150 కోట్లకు టోపీ

ఇటీవల హైదరాబాద్ నగరంలో మెదక్ జిల్లాకు చెందిన ఓ మహిళ ట్రేడింగ్ పేరిట భారీ మోసానికి పాల్పడినట్లు వెలుగులోకి వచ్చిన విషయం తెలిందే. జీడిమెట్ల పరిధిలో స్టాక్ మార్కెట్లో పెట్టుబడుల పేరిట రూ. 150 కోట్లు కొల్లగొట్టిన 'పెంగ్విన్ సెక్యూరిటీస్' సంస్థ నిర్వాహకులలో ఒకరైన స్వాతి స్వస్థలం మెదక్ జిల్లా అల్లాదుర్గం ప్రాంతంగా తెలిసింది. స్వాతి, గిరినగర్‌కు చెందిన బాలాజీలు మూడేళ్ల క్రితం జీడిమెట్ల చింతల్‌లో ది పెంగ్విన్ సెక్యూరిటీస్ పేరుతో కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. తమ సంస్థలో పెట్టుబడి పెడితే రెట్టింపు

మిగతా 8వ పేజీలో

బ్యాంకర్లు రుణ లక్ష్యాలను సాధించాలి

సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రుణ లక్ష్యాలను సాధించాలని బ్యాంకు అధికారులను సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో మంగళవారం బ్యాంకర్లు, మహిళా సంఘాలు, వ్యాపార, వాణిజ్య వివిధ సంఘాలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రాజీవ్ యువ వికాసం పథకం కింద లబ్ధిదారులకు 90 శాతం ప్రభుత్వమే భరిస్తుందని, బ్యాంకులకు ఎలాంటి ఆర్థిక భారం పడదన్నారు. బ్యాంకర్లు మహిళా సంఘాలు, వాణిజ్య, వ్యాపార, రాజీవ్ యువ వికాసం, ముద్ర రుణాలు ఇతరత్రా రుణాలు అందించి బ్యాంకు లక్ష్యాలను సాధించాలని సూచించారు.



కలెక్టరేట్‌లో బ్యాంకర్ల సమావేశంలో కరపత్రం ఆవిష్కరిస్తున్న కలెక్టర్ క్రాంతి

రుణాలు అందించడంలో ఖాతాదారులకు ఎలాంటి ఇబ్బందులు పెట్టవద్దని, వీలైనంత త్వరగా రుణాలు మంజూరు చేయాలన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రుణ లక్ష్యాలు సాధించి జిల్లా ప్రజల అభివృద్ధికి తోడ్పడాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ నర్సింహారావు, డీఆర్‌డీఏ పీడీ జ్యోతి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి, గిరిజన సంక్షేమాధికారి అఖిలేష్‌రెడ్డి, బీసీ సంక్షేమాధికారి జగదీష్, మెప్మా పీడీ గీత పాల్గొన్నారు.

రూ.10కోట్ల గంజాయి, డ్రగ్స్ దహనం

సంగారెడ్డి క్రైం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలోని నాలుగు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 27 కేసుల్లో పట్టుబడిన గంజాయి, అల్ప్రాజోలం, డైజోఫాం వంటి మత్తు పదార్థాలను మంగళవారం ఇస్నాపూర్‌లోని మెడికేర్ వేస్టేజ్ మేనేజ్‌మెంట్‌లో దహనం చేశారు. మెదక్ డిప్యూటీ కమిషనర్ జె.హరికిషన్ డిస్పోజల్ అధికారిగా వ్యవహరించారు. పటాన్‌చెరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పది కేసులు, సంగారెడ్డి పరిధిలో ఏడు, నారాయణఖేడ్‌లో మూడు, అందోల్‌లో నాలుగు కేసుల్లో ఈ గంజాయి, డ్రగ్స్‌ను ఎక్సైజ్ పోలీసులు గతంలో పట్టుకున్నారు. 209.162 కిలోల గంజాయి, ఏడు గ్రాముల డైజోఫాం, 0.496 కిలోల అల్ప్రాజోలం తదితర మత్తుపదార్థాలను దహనం చేసినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్‌చంద్ తెలిపారు. వీటి విలువ సుమారు రూ.10.11 కోట్లు వుంటుందని పేర్కొన్నారు.



దహనం చేయనున్న గంజాయి, డ్రగ్స్‌ను చూపుతున్న సంగారెడ్డి ఎక్సైజ్ పోలీసులు



షాబాద్ తండాలో రెవెన్యూ సదస్సును పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

టేక్మాల్ జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రైతులు భూ భారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. మంగళవారం టేక్మాల్ మండల పరిధిలోని షాబాద్ తండాలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సును కలెక్టర్ తనిఖీ చేశారు. అర్జీల నమోదు రిజిస్టర్‌ను పరిశీలించారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. భూ భారతి చట్టం రైతుల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. సాదాబైనామా, పీవోపీ, భూ విస్తీర్ణంలో మార్పులు చేర్పులు, పాసుపుస్తకాల అందజేత తదితర అంశాలపై దరఖాస్తులను స్వీకరించాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యల పరిష్కారం దిశగా రెవెన్యూ యంత్రాంగం ప్రతేక దృష్టిసారించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ తులసీరాం రెవెన్యూ సిబ్బంది సందీప్, మహేష్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి పీపీ యూనిట్‌లో

వైద్యుడి నియామకం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సంగారెడ్డిఅర్బన్, జూన్3 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి మాతా శిశు ఆరోగ్య కేంద్రంలోని పీపీ యూనిట్‌కు(ఫ్యామిలీ ప్లానింగ్, చిన్నారుల టీకాల విభాగం) మెడికల్ ఆఫీసర్‌ను నియమించారు. గత నెల 29 వ తేదీన 'పీపీ యూనిట్లలో డాక్టర్ లేరు' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించారు. దీంతో సంగారెడ్డి ఎంసీహెచ్‌లోని పీపీ యూనిట్‌కు కోహీర్ సీహెచ్‌సీ నుంచి డాక్టర్ దివ్యజ్యోతిని డిప్యూటేషన్‌పై కేటాయించారు. జోగిపేట ఆస్పత్రిలోని పీపీ యూనిట్‌కు మాత్రం మెడికల్ ఆఫీసర్‌ను నియమించలేదు.

కోహీర్ మున్సిపాలిటీలో

వార్డుల విభజనకు నోటిఫికేషన్



కోహీర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కొత్తగా ఏర్పడిన కోహీర్ మున్సిపాలిటీలో వార్డుల విభజనకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ రమేష్ తెలిపారు. మున్సిపాలిటీలో 10,859 మంది ఓటర్లు ఉన్నారు. జనాభాకు అనుగుణంగా 16 వార్డులను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంటి నంబర్ల ఆధారంగా పట్టణంలో కొత్త వార్డులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నోటిఫికేషన్‌కు సంబంధించి ప్రజలకు ఎలాంటి అభ్యంతరాలున్నా ఈ నెల 5వ తేదీ నుంచి 11వ తేదీ వరకు తమ మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.



సంగారెడ్డి బాలుర ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న భవనం

కార్పొరేట్ హంగులు కలేనా?

పాఠశాలల్లో నిలిచిన 'మన ఊరు-మన బడి'

నాలుగేళ్లుగా అసంపూర్తిగానే పనులు
ఎంపిక చేసిన పాఠశాలలు 441..
పూర్తయినవి 179 మాత్రమే!
సగం పాఠశాలలకు చేరని సామగ్రి

సంగారెడ్డి అర్బన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'మన ఊరు-మన బడి' మొక్కుబడిగానే మిగిలిపోయింది. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దడమే లక్ష్యంగా నాలుగేళ్ల క్రితం ప్రారంభించిన కార్యక్రమం తొలి విడత కూడా పూర్తిచేయలేదు. పాఠశాలల్లో కార్పొరేట్ వసతులు కల్పించాలనే ఉద్దేశంతో 2022 జనవరిలో అప్పటి ప్రభుత్వం మన ఊరు-మన బడి కార్యక్రమం చేపట్టింది. ప్రభుత్వ నిధులతో పాటు దాతల సహకారంతో అదనపు తరగతి గదులు, ప్రహరీ, వంట గది, డైనింగ్‌హాలు, లైబ్రరీ, ల్యాబొరేటరీ, మరుగుదొడ్లు, తాగునీటి వసతి, విద్యుత్ తదితర సౌకర్యాలు కల్పించాలని నిర్ణయించారు. సంగారెడ్డి జిల్లాలో వివిధ కేటగిరీల కింద 1,264 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా.. తొలి విడతలో 441 ప్రభుత్వ పాఠశాలల్లో వసతులను కల్పించాలని ఎంపిక చేశారు. అదే సంవత్సరం జూన్ 12 నాటికి పనులు పూర్తిచేయాలని డెడ్‌లైన్ విధించింది. కానీ, నాలుగేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ తొలి విడతలో ఎంపిక చేసిన పాఠశాలల్లోనే చేపట్టిన పనులు పూర్తికాలేదు.

రూ.18 కోట్ల బిల్లులు బకాయి

తొలి విడత ఎంపిక చేసిన 441 పాఠశాలలకుగాను 329 పాఠశాలల్లో రూ.30 లక్షల లోపు అంచనాలతో పనులను మంజూరు చేశారు. వీటిలో నాలుగు పాఠశాలల్లో ఇప్పటికీ పనులు చేపట్టలేదు. రూ.30 లక్షలకుపైగా అంచనాలతో 102 పాఠశాలల్లో పనులు మంజూరయ్యాయి. ఇందులో ఆరు పాఠశాలల్లో పనులు ప్రారంభించనే లేదు. ఇందుకు ఆయా ప్రాంతాలలోని స్కూళ్లలో పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. 441 పాఠశాలలకు 179 పాఠశాలల్లోనే సివిల్ పనులు పూర్తయ్యాయి. మిగిలిన 262 ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నాయి. ఇప్పటి వరకు చేసిన పనులకు సంబంధించి ప్రభుత్వం రూ.47 కోట్లను కాంట్రాక్టర్లకు చెల్లించగా, మరో రూ.18 కోట్ల నిధులు సర్కారు చెల్లించాల్సి ఉన్నది.

బడులకు చేరని సామగ్రి

ఎంపిక చేసిన 441 పాఠశాలలకుగాను.. 412 స్కూళ్లలో గ్రీన్‌చాక్ బోర్డులు, 369 పాఠశాలలకు డ్యుయల్ డెస్కులు వచ్చాయి. 114 పాఠశాలల్లోనే పెయింటింగ్స్ పూర్తయ్యాయి. 321 పాఠశాలలకుగాను 70 పాఠశాలలకే హెచ్‌ఎం కుర్చీలు, 302 బడులకుగాను 68 పాఠశాలలకే హెచ్‌ఎం టేబుల్స్ చేరుకున్నాయి. 342 బడుల్లో 119 స్కూళ్లకే టీచర్ల చైర్లు, 398 పాఠశాలలకుగాను 125 పాఠశాలలకు టీచర్స్ టేబుల్స్ వచ్చాయి. అదే విధంగా 109 పాఠశాలలకుగాను 16 పాఠశాలలకే లైబ్రరీ టేబుల్స్, 16 పాఠశాలలకే సైన్స్ ల్యాబొరేటరీ టేబుల్స్, 16 పాఠశాలలకే సైన్స్ ల్యాబొరేటరీ స్టూల్స్ చేరుకున్నాయి. ఇలా ప్రతిపాదనలు పంపించిన సామగ్రి కూడా చేరుకోక పోవడంతో రెండో విడత, మూడో విడత గురించి ఆలోచించే పరిస్థితే లేదు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

కుకునూరుపల్లి/కౌడిపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడిమెదక్ జిల్లాలో మంగళవారం చోటు చేసుకున్న రెండు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లిలో రోడ్డు దాటుతున్న ఓ మహిళను బైక్ వేగంగా ఢీకొట్టడంతో మృతి చెందింది. మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం దేవులతండా సమీపంలో ఓ రైతు పొలానికి నీరు పెట్టేందు కోసం రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. రెండు ఘటనలు రోడ్డుదాటుతున్న క్రమంలోనే చోటు చేసుకోవడం గమనార్హం.

● కుకునూరుపల్లి ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. కుకునూరుపల్లి మండలం మంగోల్ గ్రామానికి చెందిన లగిశెట్టి మంజమ్మ(50) గిర్నిలో కారంపొడి పట్టించుకుందామని మంగళవారం మధ్యాహ్నం కుకునూరుపల్లికి వచ్చింది. ఈ క్రమంలో బొబ్బాయిపల్లి వైపు ఉన్న గిర్ని వైపు వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపునకు వెళ్తున్న ద్విచక్రవాహనదారుడు అతి వేగంగా వచ్చి మంగమ్మను ఢీకొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మోటార్ సైకిల్ నడుపుతున్న వ్యక్తి కరీంనగర్ పోలీస్ విభాగంలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.


మృతి చెందిన మంజమ్మ

● కౌడిపల్లి మండలంలో సోమవారం రాత్రి చోటు చేసుకున్న మరో ఘటనకు సంబంధించి కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలపరిధిలోని దేవుల తండాకు చెందిన లకవత్ రమేష్ పొలం జాతీయ రహదారి 765డికి ఆవలి వైపు ఉండటంతో రాత్రి 9 గంటల ప్రాంతంలో పొలానికి నీరు పెట్టేందుకు బయలుదేరాడు. ఈ క్రమంలో రోడ్డుదాటుతుండగా మెదక్ వైపు నుంచి నర్సాపూర్‌కు వేగంగా వస్తున్న కారు రమేష్‌ను బలంగా ఢీ కొనడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య నీల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రంజిత్ రెడ్డి కేసు దర్యాప్తు చేపట్టారు.


రమేష్(ఫైల్)

గుండెపోటుతో నవ వరుడు మృతి

కొల్చారం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): నవవరుడు మృతి చెందిన సంఘటన మెదక్ జిల్లా కొల్చారం మండలం అంసానిపల్లి గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అంసాన్‌పల్లి గ్రామానికి చెందిన అక్కమొల్ల పెద్ద వెంకట్ లక్ష్మి దంపతుల కుమారుడు అక్కమొల్ల సాయికిరణ్ (19) అలియాస్ చింటుకు గత నెల 21న అంసానిపల్లి గ్రామానికి చెందిన గోల్పల శేఖర్ రుక్కమ్మల కూతురు అనూషతో వివాహం జరిగింది. పెళ్లి జరిగిన 14 రోజుల్లోనే సాయికిరణ్ గుండెపోటుతో మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.. మృతుడు పెయింటర్ పని చేస్తూ జీవిస్తున్నాడు. సోమవారం రాత్రి గ్రామంలో ఓ వివాహానికి బ్యాండ్ కొట్టడానికి వెళ్లి ఉదయం వచ్చాడు. అనంతరం స్నానం కోసం వెళ్లి బాత్రూంలోనే పడిపోయాడు. కుటుంబ సభ్యులు గమనించేసరికే అతడు మృతి చెందాడు. నవవరుడి మృతితో ఆ కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.


సాయికిరణ్(ఫైల్)

క్రైం కార్నర్

తాను మరణించినా.. నలుగురికి ప్రాణదానం

● బ్రెయిన్‌డెడ్ అయిన యువకుడి అవయవాలు దానం


వెంకటేశ్ (ఫైల్)

చిన్నకోడూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : బ్రెయిన్‌డెడ్ అయిన యువకుడి అవయవాలను అతడి కుటుంబ సభ్యులు దానం చేసి ఆదర్శంగా నిలిచారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నకోడూరు మండలం చంద్లాపూర్‌కు చెందిన పెద్దోల్ల ఐలయ్య లలిత దంపతుల పెద్ద కుమారుడు వెంకటేశ్ (21) సిద్దిపేటలోని ఓ కళాశాలలో డిగ్రీ చదువుకుంటూ తల్లిదండ్రులకు వ్యవసాయ పనుల్లో చేదోడువాదోడుగా ఉంటున్నాడు. గత నెల 30న రాత్రి గ్రామంలో వెంకటేశ్ ప్రమాదవశాత్తు జారి కింద పడడంతో తలకు తీవ్ర గాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతడిని సిద్దిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. బ్రెయిన్‌డెడ్ అయినట్లు తెలిపిన వైద్యులు అవయదానంపై యువకుడి కుటుంబ సభ్యులకు వివరించడంతో అందుకు వారు అంగీకరించారు. ఈ మేరకు మంగళవారం (గుండె, కిడ్నీలు, ఊపిరితిత్తులు, కాలేయం) అవయవాలను సేకరించారు. అనంతరం చంద్లాపూర్‌లో యువకుడి అంత్యక్రియలు జరిగాయి.

కుటుంబ కలహాలతో దంపతుల ఆత్మహత్య


బేగరి రమేశ్ (ఫైల్)


బేగరి అనిత (ఫైల్)

మునిపల్లి, జూన్ 3(ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో భార్యాభర్తలు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలంలోని పెద్దగోపులారం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. మునిపల్లి ఎస్ఐ రాజేశ్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం... పెద్దగోపులారం గ్రామానికి చెందిన బేగరి రమేశ్(40), కోహీర్ మండలం బిలాల్‌పూర్ గ్రామానికి చెందిన బేగరి అనిత(30)ను గత 13 ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్న ఈ దంపతులకు అర్చన(13), అనురాధ(8), శ్రీనాథ్(5) ముగ్గురు సంతానం. కాగా రమేశ్ భార్య అనితపై అనుమానంతో గత మూడు నెలల నుంచి గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం అర్ధరాత్రి సమయంలో దంపతుల మధ్య ఏం జరిగిందో కానీ ఇంట్లో ఐరన్‌రాడ్‌కు చున్నీతో అనిత, అదే రాడ్‌కు తాడుతో రమేశ్ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ విషయాన్ని స్థానిక పోలీసులకు సమాచారం అందించడంతో వెంటనే సంఘటన స్థలాన్ని సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్‌తో పాటు కొండాపూర్ సీఐ వెంకటేశం, మునిపల్లి ఎస్ఐ రాజేశ్‌నాయక్, సిబ్బందితో కలిసి చేరుకుని అక్కడి పరిస్థితులను పరిశీలించారు. దంపతుల ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీశారు. మృతుల బంధువులు గుడిపల్లి నర్సింలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మునిపల్లి ఎస్ఐ రాజేశ్‌నాయక్ తెలిపారు. తల్లిదండ్రులు మృతితో ముగ్గురు పిల్లలు అనాథలయ్యారు.

మరో ఘటనలో యువకుడు..


శ్రీకాంత్ (ఫైల్)

కౌడిపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో వ్యక్తి పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రాజిపేట్ గ్రామానికి చెందిన బాంచె శ్రీకాంత్ (31)కు భార్య స్వాతితో కొంత కాలంగా కుటుంబ కలహాల కారణంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో స్వాతి శివ్వంపేట మండలం గంగాయిపల్లిలోని పుట్టింటికి పది హేను రోజుల క్రితం వెళ్లింది. తీసుకొచ్చేందుకు భర్త వెళ్లినా రాకపోవడంతో మనస్తాపానికి గురైన శ్రీకాంత్ ఈ నెల 1న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా, కుటుంబీకులు ఉస్మానియా ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురిపై ఎస్సీ ఎస్టీ కేసు

మనోహరాబాద్ జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మనోహరాబాద్ గ్రామానికి చెందిన ముగ్గురు యువకులపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సుభాష్‌గౌడ్ పేర్కొన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. పర్కిబండ గ్రామానికి చెందిన బుర్రి ఉదయ్ ఈ నెల 1న పని నిమిత్తం మనోహరాబాద్‌కు వెళ్లాడు. అక్కడ స్థానిక యువకుల మధ్య గొడవ జరగగా అడ్డు వచ్చిన ఉదయ్, అతడి తండ్రి నర్సింహులు, బాబాయ్ రమేష్‌ను మనోహరాబాద్‌కు చెందిన యువకులు మహేష్, కిట్టు, స్వామి కులం పేరుతో దూషిస్తూ దాడి చేశారు. ఈ ఘటనపై విచారణ చేసిన పోలీసులు మహేష్, కిట్టు, స్వామిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేశారు. ఈ దాడిని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్, మెదక్ జిల్లా డీబీఎఫ్ అధ్యక్షుడు సంజీవ్, పర్కిబండలో బుర్రి నర్సింహులు ఖండిస్తూ కుటుంబ సభ్యులను పరామర్శించారు. దళితులపై దాడి చేసి కులం పేరుతో దూషించినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చోరీ కేసులో ఐదుగురి అరెస్ట్


నిందితులను చూపుతున్న సీఐ అనిల్ కుమార్

జోగిపేట రూరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): దినసరి కూలీలపై దాడి చేసిన ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం సీఐ అనిల్ కుమార్ జోగిపేటలోని తన కార్యాలయంలో ఈ కేసు వివరాలను వెల్లడించారు. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రవినేష్ కుమార్, అమర్‌పాల్ మండలంలోని అల్మాయిపేటలో నివాసముంటూ ఒక సీసీల కంపెనీలో పనిచేస్తున్నారు. గత నెల 28న వారిద్దరూ జోగిపేటకు వచ్చి మెడికల్ షాప్‌లో మందులు తీసుకుని తిరుగు ప్రయాణంలో ఆటోలో వెళ్తున్నారు. ఇది గమనించిన... చౌటకూరు మండలం శివంపేటకు చెందిన ఆటో డ్రైవర్ వడ్డె శ్రీకాంత్, గొలుసుల కుమార్, ఉప్పు సాయికుమార్, కుల్చారం మండలం రంగంపేటకు చెందిన ద్యారంగుల అనిల్, మక్కని నవీన్ జాతీయ రహదారిపై గల సంగుపేట అండర్ పాస్ నుంచి ఆటోను మాసాన్‌పల్లి వైపు ఒక నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లారు. వారిద్దరిపై దాడి చేసి వారి నుంచి కొంత నగదుతోపాటు రెండు సెల్ ఫోన్లను చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు మంగళవారం ఉదయం స్థానిక అంబేడ్కర్ కూడలి వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా.. అనుమానాస్పదంగా కనిపించిన ఆటో డ్రైవర్ వడ్డె శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నాడు. ఈ మేరకు వడ్డె శ్రీకాంత్‌తోపాటు వడ్డె గొలుసు కుమార్, ద్యారంగుల అనిల్, ఉప్పు సాయికుమార్, మక్కని నవీన్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిచించినట్టు సీఐ తెలిపారు.

కారు, బైక్ ఢీ.. ఒకరి మృతి


నరేందర్ (ఫైల్)

రాయపోల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కారు, బైక్ ఢీకొని యువకుడు మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. దౌల్తాబాద్‌కు చెందిన జిర్కపల్లి నరేందర్(22) కుకునూరుపల్లిలో ఫ్లెక్సీ షాపు నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగానే మంగళవారం రాత్రి షాప్ బంద్ చేసి బైక్‌పై దౌల్తాబాద్ వెళ్తుండగా గజ్వేల్ వైపు వెళ్తున్న కారు ఢీకొన్నది. గాయపడిన నరేందర్‌ను పోలీసు వారి వాహనంలో గజ్వేల్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు.


వెల్దుర్తి రైతు వేదికలో విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు


జహీరాబాద్ : రంజోల్‌లో రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయశాఖ ఏడీఏ భిక్షపతి, తదితరులు

విత్తనోత్పత్తికి ప్రోత్సాహం

● ఉత్సాహంగా 'నాణ్యమైన విత్తనం-రైతన్నకు నేస్తం' ● ఊరూరా రైతులకు మూల విత్తనాల అందజేత

గ్రామ స్థాయిలో విత్తనోత్పత్తిని ప్రోత్సహించి.. రైతులకు మేలు రకమైన విత్తనాలను అందించాలన్న ముఖ్య ఉద్దేశంతో ప్రభుత్వం 'నాణ్యమైన విత్తనం- రైతన్నకు నేస్తం' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా వ్యవసాయ శాఖ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం సౌజన్యంతో 'విత్తుకొద్దీ పంట' పేరుతో ప్రతీ గ్రామంలో ముగ్గురు రైతులను ఎంపిక చేసి వంద శాతం సబ్సిడీపై మూల విత్తనాలు అందజేస్తున్నది. మంగళవారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా విత్తనాల పంపిణీని పండగలా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, వ్యవసాయ అధికారులు, నాయకులు పాల్గొని సన్న రకం వరి, పెసర, కంది తదితర మూల విత్తనాలను రైతులకు అందజేశారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులు పాల్గొని అన్నదాతలకు పంటల సాగుపై అవగాహన కల్పించారు.

-న్యూస్ నెట్‌వర్క్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి)

● కొండపాక మండలం దుద్దెడ రైతు వేదికలోని 11 రెవెన్యూ గ్రామాల రైతులకు ఏఎంసీ కొండపాక వైస్ చైర్మన్ పరుశరాములు, వ్యవసాయ అధికారి శివరామకృష్ణ విత్తనాలను అందజేశారు.

● నారాయణఖేడ్ మండల పరిధిలోని జూకల్ శివారులో రైతు వేదికలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి హాజరై విత్తన బస్తాలను పంపిణీ చేశారు. ఖేడ్ డివిజన్‌లో 113 మందికి విత్తనాలను అందించారు.

● సదాశివపేట మండలం మద్దికుంట గ్రామంలోని రైతు వేదికలో సీడీసీ చైర్మన్ గడీల రాంరెడ్డి హాజరై రైతులకు విత్తనాలను అందజేశారు. అనంతరం జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ చంద్రశేఖర్ సాగు సమయంలో పాటించాల్సిన మెళకువలను వివరించారు.


ములుగులో రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు

● కల్హేర్, సిర్గాపూర్ రైతు వేదికల్లో జరిగిన కార్యక్రమంలో కల్హేర్, సిర్గాపూర్ మండలాల వ్యవసాయ అధికారులు వెంకటేశం, హరిక్రిష్ణ, వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు చరిత్‌కుమార్, హరి పాల్గొని రైతులను విత్తనాలను అందజేశారు.

● జహీరాబాద్ పట్టణంలోని రంజోల్ రైతువేదికలో వ్యవసాయశాఖ ఏడీఏ భిక్షపతి, శాస్త్రవేత్త విజయ్‌కుమార్ రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. జహీరాబాద్ మండలానికి 59 విత్తనాల కిట్లను కేటాయించినట్లు అధికారులు తెలిపారు.

● ఝరాసంగం మండల పరిధిలోని బర్దీపూర్ రైతు వేదికలో వ్యవసాయ శాఖ ప్రొఫెసర్ జయశంకర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ సతీష్, మండల వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశం విత్తనాలను అందజేశారు.

● అల్లాదుర్గం మండలం చేవెళ్ల గ్రామంలోని రైతు వేదికలో పీజేటిఏయూ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త పద్మశ్రీ రైతులకు విత్తనాలు అందజేశారు.

● పెద్దశంకరంపేట రైతు వేదికలో రాజేంద్రనగర్ యూనివర్సిటీ శాస్త్రవేత్త చైతన్య, మండల వ్యవసాయాధికారి నాగం కృష్ణ విత్తనాలను అందజేశారు.

● వెల్దుర్తి రైతు వేదికలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త లక్ష్మీప్రసన్న అధికారులతో విత్తనాలు పంపిణీ చేశారు.

● చేగుంట మండలంలో ఆయా గ్రామాల రైతులకు వ్యవసాయ అధికారి హరిప్రసాద్, మానిటరింగ్ అధికారి శాస్త్రవేత్త చైతన్య విత్తనాలు అందజేశారు.

● రేగోడు రైతు వేదికలో మండల వ్యవసాయ అధికారి జావిద్ పాల్గొని విత్తనాలు అందజేశారు.

● హవేళిఘణపూర్ మండల కేంద్రంలోని రైతువేదిక ఏడీఏ విజయనిర్మల, శాస్త్రవేత్త జెనిమా తదితరులతో కలిసి రైతులకు విత్తనాలు అందజేశారు.

● పాపన్నపేట మండల పరిధి మల్లంపేట రైతు వేదికలో జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.నిర్మల, మండల వ్యవసాయాధికారి నాగమాధురి విత్తనాలను అందజేశారు. మొత్తం 32 మందికి పంపిణీ చేశారు.

● జగదేవ్‌పూర్ రైతువేదికలో మండల వ్యవసాయ అధికారి వసంతరావు అందజేశారు.

● కుకునూరుపల్లి రైతువేదికలో శాస్త్రవేత్త చిరంజీవి విత్తనాలను అందజేశారు.

● కోహెడ మండల కేంద్రంలో వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీజయ ఏవో సతీష్, మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని నిర్మల జయరాజుతో కలిసి రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు.

● మద్దూరు మండలకేంద్రంలోని రైతువేదికలో ఏవో రామకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తోర్నాల వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త ఎ. సతీష్ పాల్గొని విత్తనాలు అందజేశారు.

● సిద్దిపేట రూరల్ : ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త పల్లవి చిన్నకోడూరు, నారాయణరావుపేట మండలాల్లోని 70 మందికి విత్తనాలు అందజేశారు.

● గజ్వేల్ పట్టణంలోని రైతు వేదికలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరి యాదవరెడ్డి హాజరై విత్తనాలు అందజేశారు.

● కొమురవెల్లి మండలంలోని మర్రిముస్త్యాల గ్రామ రైతు వేదికలో రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త డా.మహ్మద్ అలీబాబా, మండల వ్యవసాయ అధికారి వెంకట్రావమ్మ పంపిణీ చేశారు.

● దుబ్బాక దుబ్బాక రైతు వేదికలో వ్యవసాయాధికారి ప్రవీణ్ వ్యవసాయ శాస్త్రవేత్త ఎల్లాగౌడ్‌తో కలిసి రైతులకు విత్తనాలను అందజేశారు.

● వర్గల్ రైతు వేదికలో వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ప్రమీల విత్తనాలను అందజేశారు.

● హుస్నాబాద్‌రూరల్ : హుస్నాబాద్ రైతు వేదిక కార్యాలయంలో మండల వ్యవసాయ అధికారి శ్రేయ, శాస్త్రవేత్త ఎల్ రాజా ఎంపిణీ చేశారు.

● చేర్యాల పట్టణంలోని రైతువేదికలో జిల్లా వ్యవసాయాధికారి రాధిక, కృషి విజ్ఞానకేంద్రం, మెట్ట పరిశోధనకేంద్రం శాస్త్రవేత్తలు అలీబాబా, శాలిని రైతులకు విత్తనాలు, సీడ్ డ్రిల్ అందజేశారు.

● మర్కుక్ రైతువేదికలో విత్తనాలు అందించారు.

పట్టు ఉత్పత్తిలో సిద్దిపేట జిల్లా మొదటి స్థానం

● పట్టు పరిశ్రమ శాఖ ఇంద్రసేనారెడ్డి


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీ ఇంద్రసేనారెడ్డి

రాయపోల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పట్టుగూళ్ల ఉత్పత్తిలో సిద్దిపేట జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉందని ఏడీ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాయపోల్‌లో పట్టు పరిశ్రమ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్బరి తోట, పట్టు పురుగుల పెంపకం చెపట్టే రైతులకు ప్రభుత్వం నుంచి అన్ని రకాల సబ్సిడీలు అందుతాయని పేర్కొన్నారు. పట్టు పురుగుల పెంపకం చేపట్టే రైతులు ఎకరం మల్బరీ తోట సాగు చేస్తే ఏడాదికి రెండున్నర లక్షల నుంచి మూడున్నర లక్షల రూపాయల వరకు నికర ఆదాయం లభిస్తుందని తెలిపారు. సిద్దిపేట జిల్లాలో 43 కుటుంబాలు 1,127 ఎకరాల్లో మల్బరీ సాగు చేస్తున్నాయని స్పష్టం చేశారు. వారంతా ఆర్థికంగా స్థిరపడుతున్నారని అన్నారు. మల్బరీ తోట బహువార్షిక పంట అని, తక్కువ నీటితో ఎక్కువ సాగు చేసి అధిక లాభాలు పొందవచ్చునని పేర్కొన్నారు. ఒక్కసారి మల్బరీ తోట నాటితే 15 నుంచి 20 సంవత్సరాల వరకు పట్టు పురుగుల మేత కోసం మల్బరీ ఆకులు లభిస్తాయని అన్నారు. మల్బరీ తోట అన్ని రకాల వాతావరణాలను తట్టుకొని పెరుగుతుందని పేర్కొన్నారు. పట్టు పురుగుల సాగుపై దృష్టిపెట్టాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సెరీకల్చర్ ఆఫీసర్ మల్లేశం, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, రైతులు పాల్గొన్నారు.

నేడు ఐఐటీహెచ్‌లో జేఈఈ ఓపెన్ డే

కంది, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : జేఈఈ (జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామ్)లో మంచి ర్యాంకు సాధించి ఐఐటీలలో సీటు పొందాలని ఆశపడే విద్యార్థులకు సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌లో బుధవారం జేఈఈ ఓపెన్ డే-2025 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జేఈఈలో మంచి ర్యాంకు వచ్చి ఇంజనీరింగ్, దాని తర్వాత ఏం చేయాలనే సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవడానికి ఆహ్వానం పలుకుతున్నారు. ఇందులో భాగంగానే బుధవారం ఐఐటీహెచ్ ప్రాంగణంలోని లెక్చరర్స్‌హాల్ కాంప్లెక్స్‌లో ఉదయం 10 గంటల నుంచి ఆఫ్‌లైన్ సెషన్‌లో ప్రత్యక్షంగా జేఈఈ ర్యాంకర్స్‌తో మాట్లాడనున్నారు. ఐఐటీలలో చదవాలనుకునే ఆశావహులకు ఐఐటీలలో ఎందుకు చదవాలి, ప్లేస్‌మెంట్స్ ఎలా ఉంటాయి, ఇంటర్న్‌షిప్‌లు, వినూత్న అవకాశాలు, క్యాంపస్ లైఫ్, ఆవిష్కరణలు, సాంకేతికతలపై ఉన్న అనుమానాలను తీర్చనున్నారు. అలాగే ఈ నెల 5న గురువారం ఉదయం 10 గంటల నుంచి ఐఐటీహెచ్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ మోడ్‌లో కూడా ఇదే సెషన్‌ను నిర్వహించనున్నారు. మరిన్ని వివరాలకు ఐఐటీహెచ్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని తెలిపారు.

కార్మికులకు ఉద్యోగ భద్రత అత్యవసరం


● సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు


మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కరాములు

జహీరాబాద్, జూన్ 3(ఆంధ్రజ్యోతి) :కర్మాగారాల్లో పనిచేసే కార్మికులకు ఉద్యోగభద్రత అత్యవసరమని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కరాములు పేర్కొన్నారు. ఈ నెల 5న మహీంద్ర కర్మాగారంలో కార్మిక సంఘం ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం కార్మికులతో గేట్‌మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందం చేయించిన ఘనత సీఐటీయూ యూనియన్‌కే దక్కిందన్నారు. ఈ నెల 5న జరిగే ఎన్నికల్లో సీఐటీయూ యూనియన్ చక్క గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా మెనిఫెస్టోను విడుదల చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మల్లేశం, రాంచందర్, ఆయా పరిశ్రమల నాయకులు బాగారెడ్డి, పాండురంగారెడ్డి, మైపాల్, రాజీరెడ్డి, కనకరెడ్డి, గణేష్, నర్సయ్య, నారాయణ, సందీప్‌రెడ్డి, నరేష్, మణి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

● టీఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు అశ్వత్థామరెడ్డి


ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న అశ్వత్థామరెడ్డి

పాపన్నపేట, జూన్ 3(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని టీఎంయూ వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర నాయకుడు అశ్వత్థామరెడ్డి అన్నారు. మంగళవారం ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల ఆలయం వద్ద నిర్వహించిన ఆర్టీసీ కార్మికుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆర్టీసీ కార్మికులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. ప్రభుత్వంపై నమ్మకంతోనే సమ్మెను విరమించామని, వెంటనే బకాయిలు చెల్లించాలన్నారు. కార్మికుల సమస్యల పట్ల పోరాటం చేయడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామన్నారు. ప్రభుత్వంపై తమకు పూర్తి విశ్వాసం ఉందని ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. యూనియన్ నాయకులు ఎంఆర్కే రావు, శాకన్న, ఆశ్వక్, వెంకన్న, నర్సింహులు, ముత్యం, సంగమేశ్వర్, శంకర్, సందీప, జ్యోతి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

విద్యకు చిన్నారులు దూరం

● ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలకు నోచుకోని కాజీపల్లి కాలనీ
● గ్రామానికి 3 కిలోమీటర్ల దూరంలో కాలనీ
● వెయ్యికి పైగా నివాసాలు.. వందల్లో చిన్నారులు
● గతేడాది పరిశీలించిన కలెక్టర్, డీఈవోలు
● పాఠశాల ఏర్పాటుకు ఎకరా స్థలం కేటాయించేందుకు ప్రతిపాదనలు
● నేటికీ మంజూరు కాని స్థలం


కాజీపల్లి కాలనీ ముఖచిత్రం

జిన్నారం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ చిన్నారి విద్యను హక్కుగా పొందాలనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యా హక్కు చట్టం సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలంలోని కాజీపల్లి కాలనీ నోచుకోవడం లేదు. గ్రామపంచాయతీ కాజీపల్లి గ్రామానికి దూరంగా వెలసిన కాలనీలో వెయ్యికి పైగా నివాసాలు, మూడువేల జనాభా, వందల సంఖ్యలో చిన్నారులు ఉన్నా అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల లేక చాలామంది చిన్నారులు విద్యకు దూరంగా ఉంటున్నారు. గతేడాది కాలనీలో పర్యటించిన జిల్లాస్థాయి అధికారులు స్థానికంగా పాఠశాల ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీలు నేటికీ నేరవేలేదు. దీంతో ఈ విద్యా సంవత్సరం కూడా కాలనీలోని చిన్నారులు ప్రభుత్వ విద్యకు దూరంగానే ఉండే పరిస్థితులు ఉన్నాయి.

గ్రామానికి కాలనీ, విద్యకు చిన్నారులు..

జిన్నారం మండలం గడ్డపోతారం మున్సిపాలిటీలో విలీనమైన కాజీపల్లి గ్రామ పరిధిలో ఉన్న 181 జీఎంఆర్ కాలనీ గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉండగా.. ఇక్కడ నివాసముండే కుటుంబాల చిన్నారులు ప్రాథమిక విద్యకు దూరంగా ఉన్నారు. ముఖ్యంగా 2008, 2023లో 181 నంబరులోని ప్రభుత్వ భూముల్లో నిరుపేదలకు ప్రభుత్వం పంపిణీ చేసిన నివాసాల పట్టాలతో ఇళ్లు నిర్మించగా.. ఇక్కడ సుమారు 1,050 వరకు కుటుంబాలు నివాసముంటున్నాయి. కాజీపల్లి గ్రామపంచాయతీ పరిధిలో నగరానికి సమీపంలో ఔటర్ రహదారి సర్వీస్ రోడ్డుకు ఆనుకుని ఈ కాలనీ ఏర్పాటు కాగా.. 17 ఏళ్లలో ఈ కాలనీ జనావాసాలతో నిండి ఉన్నది. ఇక్కడ ఉండే కుటుంబాలకు చెందిన చిన్నారులకు ప్రభుత్వ విద్య దూరభారంలా మారింది. ఇక్కడి నుంచి కాజీపల్లి ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు మూడు కిలోమీటర్ల దూరంలో ఉండడంతో చిన్నారులు వెళ్లే పరిస్థితి లేదు. అదే విధంగా కాలనీ పక్కనే రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా పరిధి కావడంతో అక్కడి పాఠశాలకు వెళ్లే పరిస్థితి లేదు. దీంతో దశాబ్దకాలంగా ఈ కాలనీవాసులు స్థానికంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, చిన్నారుల కోసం అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులు. ప్రజా ప్రతినిధులను కోరుతున్నారు. గతేడాది ఈ కాలనీలో పర్యటించిన కలెక్టర్, డీఈవోలు ఇక్కడ ప్రాథమిక పాఠశాల ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేశారు. ప్రతిపాదనలు పంపాలని ఆదేశించగా 181లో ఎకరా స్థలం పాఠశాల కోసం కేటాయించాలని రెవెన్యూ అధికారులు ప్రతిపాదనలు పంపారు. పాఠశాల ఏర్పాటు కోసం మండల విద్యాశాఖ నుంచి కూడా ప్రతిపాదనలు పంపించారు. ఏడాది గడుస్తున్నా స్థలం, పాఠశాల మంజూరీలో ఎలాంటి పురోగతి లేదు.

పాఠశాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం

కాజీపల్లి కాలనీలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం. గతేడాది కాలనీలో పర్యటించి పాఠశాల ఏర్పాటుకు తాత్కాలిక భవనం కోసం పరిశీలన చేశాం. కొత్త పాఠశాల ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి ఆమోదం రావాల్సి ఉన్నది. ఇక్కడ ప్రాథమిక పాఠశాల ఏర్పాటు కోసం డీఈవోకు మరోసారి నివేదిక అందజేస్తామని ఆయన తెలిపారు.

- కుమారస్వామి, ఎంఈవో

మతసామరస్యంతో బక్రీద్‌ను జరుపుకోవాలి

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్
- సోషల్ మీడియాలో వచ్చే వార్తల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ రాజేష్‌చంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్. పక్కన జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ రాజేష్‌చంద్ర

మెదక్ అర్బన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : బక్రీద్ పండుగను శాంతియుతంగా మత సామరస్యంతో జరుపుకోవాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన శాంతి సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ... ఈ నెల 7న జరగనున్న బక్రీద్ పండుగకు గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మత సామరస్యానికి చిహ్నంగా నిర్వహించుకునేలా ప్రణాళికతో ముందుకు పోతున్నామన్నారు. గోవుల అక్రమ రవాణా జరగకుండా జిల్లాలో చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలని పోలీస్‌శాఖకు సూచించారు. గోవులను రక్షించడంలో భాగంగా పోలీస్‌శాఖ వాహనాలను సీజ్ చేసినప్పుడు గోవులను గోశాలకు తరలించి, వాటికి ఆహారం అందించడానికి మున్సిపల్ శాఖ ఏర్పాటు చేయాలన్నారు. మెదక్‌తో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లోని కబేళాల వద్ద నీటి సమస్యను నివారించడానికి తగిన ఏర్పాట్లు చేస్తూ.. శానిటేషన్ విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలతో పాటు పీడీ యాక్ట్ కూడా ప్రయోగిస్తామని కలెక్టర్ హెచ్చరించారు. జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ రాజేష్‌చంద్ర మాట్లాడుతూ అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జిల్లావ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సోషల్ మీడియాలో వచ్చే వార్తలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏమైనా సమస్యలుంటే పోలీసు అధికారుల దృష్టికి తీసుకొస్తూ.. స్టేషన్లకు సమాచారమందించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ మహేందర్, వివిధశాఖల జిల్లా అధికారులు వెంకటయ్య, ఎల్లయ్య, యాదయ్య పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

'పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి'

చిన్నశంకరంపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని ఎంఈవో పుష్పవేణి అన్నారు. మంగళవారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలో పాటు శాలిపేట, ఖాజాపూర్, జంగరాయి గ్రామాల్లో ఉపాధ్యాయులు ఇంటింటికి వెళ్లి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కల్హేర్, జూన్ 3(ఆంధ్రజ్యోతి) : ఎస్టీ బాలికల మినీ గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గురుకుల పాఠశాలల ప్రాంతీయ సమన్వయ కర్త నాగార్జున రావ్, కల్హేర్(బాచేపల్లి) గురుకుల పాఠశాల హెచ్ఎం కవిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటవ తరగతిలో 30 సీట్లు బ్యాక్ లాగ్‌లో మిగిలిన 5వ తరగతిలో 15 సీట్లు ఖాళీ ఉన్నాయని, ఈ నెల 6లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థుల పేర్లు 9న లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేయబడుతుందని తెలిపారు. మిగతా వివరాలకు కోసం 7981090652 నంబరులో సంప్రదించాలని సూచించారు.

'సహజ వనరులను పరిరక్షించుకోవాలి'

నారాయణఖేడ్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సహజ వనరులను పరిరక్షించుకోవాలని స్థానిక మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ తెలిపారు. స్టోన్ వాటర్‌డే సందర్భంగా మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని రోడ్ల పక్కన పెరిగిన పొదలను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. పలు కాలనీల్లోని కాలువల్లో మురుగును తొలగించి వీధులను శుభ్రం చేశారు. ఆయా కార్యక్రమాలను మున్సిపల్ శానిటేషన్ శ్రీనివాస్‌తో కలిసి కమిషనర్ పర్యవేక్షించారు.

ఝరాసంగం ఆలయ కమిటీ డైరెక్టర్‌గా ఈశ్వరప్ప



ఈశ్వరప్ప

నారాయణఖేడ్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : చరిత్రాత్మకమైన పుణ్యక్షేత్రం ఝరాసంగం ఆలయ కమిటీ డైరెక్టర్‌గా తుర్కపల్లి మాజీ సర్పంచ్ శ్వరప్పరప్ప నియామకం అయ్యారు. మొట్ట మొదటిసారిగా ఖేడ్ నియోజకవర్గానికి చెందిన ఈశ్వరప్ప నియామకం కావడంతో ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆయనను తన నివాసంలో గృహంలో సన్మానించారు. ఈశ్వరప్పను ఎమ్మెల్యేతో పాటు డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, సేవాలాల్ సంఘం రాష్ట్ర నాయకులు రమేష్‌చౌహాన్, విఠల్‌రావు, అశోక్‌రావు, పరశురాం, మాజీ ఎంపీటీసీ పండరిరెడ్డి అభినందించారు.

గ్రామంలోకి చెరువు నీళ్లు



జీర్లపల్లిలో ప్రధాన రహదారిపై పారుతున్న చెరువు నీళ్లు

ఝరాసంగం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని జీర్లపల్లి గ్రామం పక్కన గల చెరువు నుంచి నీళ్లు మంగళవారం రోడ్లపై ప్రవహించడంతో వాహనదారులు, గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ స్తంభాల మరమ్మతులకు కోసం సోమవారం రాత్రి ఆ శాఖ సిబ్బంది తూము గేట్లను తెరవడంతో నీరు రోడ్లపై పారింది. ఈ విషయాన్ని తెలుసుకున్న ఇరిగేషన్ అధికారులు చెరువు వద్దకు వచ్చి తూము గేట్లను మూసివేశారు.

మత్తు పదార్థాలు అమ్మితే చర్యలు

నర్సాపూర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : గంజాయి, మత్తు పదార్థాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని నర్సాపూర్ ఎక్సైజ్ సీఐ ముస్తాఫా హెచ్చరించారు. సిరిసిల్లా నుంచి నర్సాపూర్ సీఐగా బదిలీపై వచ్చి బాధ్యతలు తీసుకున్న తర్వాత మొదటిసారి విలేకరులతో మాట్లాడారు.

ఇందిరమ్మ ఇళ్లతో పేదవారి సొంతింటి కల సాకారం

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి



ఇందిరమ్మ మోడల్ హౌస్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి

జిన్నారం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిన్నారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో రూ.5 లక్షలతో నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు మోడల్ హౌస్‌ను ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డితో కలిసి ప్రారంభించారు. పూర్తి పారదర్శకతతో రాజకీయాలకతీతంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. నియోజకవర్గానికి మొదటి విడతలో 3,500 నివాసాలు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. నూతన టెక్నాలజీతో తక్కువ ఖర్చులో మోడల్ హౌస్‌ను నిర్మించడం పట్ల ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్, ఎంపీడీవో అరుణ, మోడల్ హౌస్ నిర్మించిన వేదాన్ ఇన్‌ఫ్రా సీఈవో మల్లికార్జున్, వివిధ గ్రామాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

కేసులు పెండింగ్ లేకుండా చూడాలి : ఎస్పీ పంకజ్



పుల్కల్ పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి క్రైం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : పోలీస్‌స్టేషన్‌లో కేసులు పెండింగ్ లేకుండా చూడాలని ఎస్పీ పరితోష్ పంకజ్ ఆదేశించారు. పుల్కల్ పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. అండర్ ఇన్వెస్టిగేషన్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. లాంగ్ పెండింగ్ కేసుల ఛేదనకు ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలని, నాణ్యమైన ఇన్వెస్టిగేషన్‌ను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం ఎస్పీ సింగూర్ ప్రాజెక్టును సందర్శించారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా ప్రాజెక్టుకు రోజు వచ్చే ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో, ప్రస్తుత నీటి మట్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టుకు వచ్చే సందర్శకులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేశామన్నారు. ఆయన వెంట జోగిపేట సీఐ అనిల్‌కుమార్, పుల్కల్ ఎస్ఐ క్రాంతికుమార్ తదితరులు ఉన్నారు.

కలెక్టర్ మేడం.. రైతులకు న్యాయం చేయండి

- కలెక్టర్‌కు భూ బాధితుల విన్నపం



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

గుమ్మడిదల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ మేడం... రైతులకు న్యాయం చేయాలని భూబాధిత రైతులు కలెక్టర్ వల్లూరి క్రాంతిని కోరారు. చట్టప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని గుమ్మడిదల రైతులు విన్నవించారు. మంగళవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి నేతృత్వంలో మాజీ మంత్రి హరీశ్‌రావు సూచన మేరకు సంగారెడ్డి కలెక్టరేట్‌లో కలెక్టర్ వల్లూరు క్రాంతిని కలిసి తాము సాగు చేసుకుంటున్న భూములు ప్రభుత్వం రిటర్న్ తీసుకోవడం వల్ల జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. చట్ట ప్రకారం అందాల్సిన నష్టపరిహారాన్ని తక్షణమే ప్రభుత్వం నుచి అందేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల మండల అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి, మంద భాస్కర్‌రెడ్డి, సూర్యనారాయణ పాల్గొన్నారు.

కార్మికులను నిరాశపర్చిన సీఎం

సంగారెడ్డి అర్బన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఆర్టీసీ కార్మికులకు తీపి కబురు చెబుతారని ఆశించిన ఉద్యోగులకు సీఎం రేవంత్‌రెడ్డి నిరాశపర్చారని ఆర్టీసీ జాతీయ మజ్దూర్ యూనియన్(టీజేఎంయూ) రాష్ట్ర కార్యదర్శి పల్లె కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5న జరిగే క్యాబినెట్ సమావేశంలోనైనా ఆర్టీసీ ఉద్యోగులు వేతన సవరణ, ప్రభుత్వంలో విలీనం, యూనియన్ల పునరుద్ధరణ చేసి సమన్యాయం చేయాలని కోరారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

చేగుంట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : నకిలీ విత్తనాలు విక్రయిస్తే డీలర్ల లైసెన్స్ రద్దుతో పాటు కఠిన చర్యలు ఉంటాయని నార్సింగి ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి హరిప్రసాద్ హెచ్చరించారు. మంగళవారం నార్సింగి మండల కేంద్రంలో ఎస్ఐ అహ్మద్ మొైనుద్దీన్, మండల వ్యవసాయ విస్తీర్ణ అధికారి విజృంభనలతో కలిసి పలు దుకాణాలను తనిఖీ చేశారు. స్టాక్ రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం కేటాయించిన ధరలకే రైతులకు ఎరువులు విత్తనాలు విక్రయించాలని తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- డీఎంహెచ్‌వో శ్రీరామ్

చిన్నశంకరంపేట/చేగుంట/రేగోడు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో శ్రీరామ్ వైద్య సిబ్బందికి సూచించారు. మంగళవారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని పీహెచ్‌సీని సందర్శించి, వైద్య సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు గ్రామాల్లో పరిశుభ్రత పాటించేందుకు ఇంటింటికి వెళ్లి సూచనలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ సాయిసింధు, మెడికల్ సూపర్‌వైజర్ యాదగిరిరావు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు. అలాగే చేగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో ఆకస్మికంగా తనిఖీ చేశారు. రేగోడు మార్కెట్‌యార్డు కాలనీలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి పరీక్షలు చేశారు. అనంతరం సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి వికాస్ సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఈశ్వర్‌గౌడ్, కమల్, సంగయ్య, సునీత, కళావతి పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నిర్మూలించడం మనందరి బాధ్యత : డీఈవో



మాట్లాడుతున్న సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు

సంగారెడ్డి అర్బన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మానవ అక్రమ రవాణా నిర్మూలించడం మనందరి బాధ్యత అని సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు అన్నారు. సంగారెడ్డిలోని సెయింట్ ఆన్స్ హైస్కూల్‌లో ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి సంస్థ ఆధ్వర్యంలో స్కూల్ అసిస్టెంట్ టీచర్లకు నిర్వహించిన రెండురోజుల శిక్షణా కార్యక్రమానికి మంగళవారం హాజరై మాట్లాడారు. మానవ అక్రమ రవాణా అనేది ప్రపంచవ్యాప్తంగా అత్యంత వేగంగా విస్తరిస్తూ ఎంతో మంది అమ్మాయిల జీవితాలను నాశనం చేస్తున్న నేరపూరితమైన చర్య అన్నారు. అప్రమత్తంగా ఉంటే మానవ అక్రమ రవాణా నిర్మూలించొచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజ్వల సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ బలరామ కృష్ణ, ప్రజ్వల అసిస్టెంట్ కోఆర్డినేటర్ అంబర్‌సింగ్, జీఈసీవో సుప్రియ, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతోనే సంపూర్ణ ఆరోగ్యం

కోహీర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : చిరుధాన్యాలతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జాతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త రాజేంద్రకుమార్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కవేలి, వెంకటాపూర్, పీచేర్యాగడి గ్రామాల్లో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయేరోజుల్లో చిరుధాన్యాలకు అధిక ప్రాధానం లభిస్తుందన్నారు. ఉద్యానవన శాస్త్రవేత్త శైలజ మాట్లాడుతూ కూరగాయల పంటల సాగుతో వచ్చే లాభాల గురించి రైతులకు వివరించారు. గృహ విజ్ఞాన శాస్త్రవేత్త హేమలత ప్రధాన మంత్రి కిసాన్ సామాన్‌నిధి తదితర పథకాల గురించి వివరించారు.

జిల్లెలవాగులోకి విష రసాయనాలు



కాజీపల్లి వద్ద జిల్లెలవాగులో ప్రవహిస్తున్న పరిశ్రమల విష రసాయనాలు

జిన్నారం, జూన్, 3 (ఆంధ్రజ్యోతి) : పరిశ్రమల రసాయనాలు దిగువ ప్రాంతాలకు ప్రవహించకుండా పీసీబీ ఏర్పాటు చేసిన సంప్ పూర్తిగా నిండి జిల్లెలవాగులోకి ప్రవహిస్తున్నాయి. జిన్నారం మండలం గడ్డపోతారం, కాజీపల్లి పారిశ్రామిక వాడల మధ్యలో జిల్లెలవాగుపై పీసీబీ సంప్‌ను ఏర్పాటు చేయగా స్థానిక మోడల్ ఇండస్ట్రీయల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంప్‌లో చేరిన వ్యర్థాలను సేకరించి ట్రీట్‌మెంట్ ప్లాంట్లకు పంపుతారు. ఇటీవల వ్యర్థాల సేకరణ నిర్వహించకపోవటంతో సంప్ పూర్తిగా నిండి జిల్లెలవాగులో రసాయనాలు ప్రవహించటంతో కాజీపల్లి, గండిగూడెం చెరువులు, సమీప ప్రాంతాలు ఘాటైన వాసనలతో కంపు కొడుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నీటి సమస్య పరిష్కారం

వెల్దుర్తి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని హస్తాల్‌పూర్ గ్రామంలో మిషన్ భగీరథ నీరు రావడం లేదని సోమవారం మహిళలు, గ్రామస్థులు ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. దీంతో స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ సంపత్, డిప్యూటీ ఈఈ శ్రీనివాస్, మిషన్ భగీరథ డీఈ ప్రవీణ్, ఏఈలు హస్తాల్‌పూర్ గ్రామాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని గంగిరెద్దులవాడకు నీరు పంపిణీ చేశామని, బుధవారం వరకు ఎస్సీ వాడలో ఉన్న నీటి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

సమస్యల పరిష్కారానికే 'భూభారతి'

భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం భూభారతి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని పలువురు పేర్కొన్నారు. మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో మంగళవారం భూభారతి అవగాహనా సదస్సులు నిర్వహించారు. పలువురు రైతులు భూ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రాలు అందజేశారు.

- న్యూస్ నెట్‌వర్క్



నారాయణఖేడ్ మండలం బాణాపూర్‌లో భూభారతి అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి



పుల్‌కల్ మండలం చక్రియాల్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న అందోలు-జోగిపేట ఆర్డీవో పాండు



నర్సాపూర్ మండలం మంతూరులో నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నగేష్



చిన్నశంకరంపేట మండలం అంబాజీపేటలో రైతుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను పరిశీలిస్తున్న ఆర్డీవో రమాదేవి

ట్రేడింగ్ మాయ

5వ పేజీ తరువాయి

లాభాలిస్తామంటూ ప్రచారం చేశారు. చిన్నమొత్తాలు పెట్టుబడి పెట్టినా ఇన్వెస్టర్లు లాభం ఇస్తున్నారని నమ్మించి, పెద్దమొత్తాల్లో పెట్టుబడి పెట్టించారు. ఇలా అమాయకుల నుంచి రూ. 150 కోట్లు వసూలు చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.

అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ

ట్రేడింగ్ పేరిట లక్షకు లక్ష రూపాయలు లాభం చూపిస్తామని నమ్మబలికే కేటుగాళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ పేర్కొన్నారు. సైబర్ నేరగాళ్లు కొత్త దారుల్లో మోసాలకు పాల్పడుతూ అమాయకుల బ్యాంకు ఖాతాలను కొల్లగొడుతున్నీరని పేర్కొన్నారు. చదువుకున్న వారే అత్యధికంగా మోసపోతున్నారని, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు కూడా సైబర్ నేరగాళ్ల వలలో పడుతున్నారని చెప్పారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు ఇస్తామంటే ఆలోచించాలని, అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసినా స్పందించకూడదని సూచించారు. సైబర్ మోసానికి గురైతే 1930 నంబర్‌కు లేదా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

రేషన్.. పరేషాన్

5వ పేజీ తరువాయి

ఒక్కొక్కరికి పది నిమిషాల సమయం పడుతున్నది. దీనికితోడు సర్వర్ సమస్యతో మరింత ఆటంకం కలుగుతున్నది. రోజంతా వందమందికి బియ్యం ఇవ్వలేకపోతున్నారు. దీంతో రేషన్ దుకాణాల వద్ద లబ్ధిదారులు బారులు తీరుతున్నారు. తమ వంతు కోసం గంటల తరబడి పడిగాపులు కాస్తున్నారు. వ్యవసాయ పనులు ప్రారంభమైనవేళ రోజంతా రేషన్ దుకాణాల వద్దనే నిలబడాల్సి వస్తున్నదని పల్లె ప్రజలు వాపోతున్నారు. మూడునెలల కోటా ఒకేసారి ఇవ్వాలనే ప్రభుత్వం ఉద్దేశం మంచిదే అయినా.. ఆటంకం తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

హరీశ్‌రావుకు శుభాకాంక్షల వెల్లువ



హరీశ్‌రావు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న మైనార్టీ నాయకులు మోయిద్‌ఖాన్, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్/సంగారెడ్డి రూరల్/ఝరాసంగం/గుమ్మడిదల/మెదక్ కల్చరల్/జహీరాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు జన్మదినాన్ని పురస్కరించుకొని మంగళవారం మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డితో కలిసి మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు మోయిద్‌ఖాన్ హైదరాబాద్‌లోని ఆయన నివాస గృహంలో శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హరీశ్‌రావుకు వారు పుష్పగుచ్ఛం అందించారు. సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ హైదరాబాద్‌లో హరీశ్‌రావును కలిసి శుభాకాంక్షలు తెలిపి, సన్మానించారు. సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్‌చేసి వేడుకలు నిర్వహించారు. ఝరాసంగం మండలంలోని కేతకీ సంగమేశ్వరస్వామి ఆలయంలో బీఆర్ఎస్ నాయకులు పూజలు చేశారు. గుమ్మడిదల మండల కేంద్రంలో పార్టీ అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్ ఆధ్వర్యంలో హరీశ్‌రావు జన్మదిన వేడుకలు నిర్వహించారు. మెదక్ జిల్లా కేంద్రంలో పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మారెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్లు ఆరేళ్ల మల్లికార్జునగౌడ్, బట్టి జగపతి, పార్టీ పట్టణ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు, మాజీ కౌన్సిలర్లు మెదక్ నియోజకవర్గంలోని వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలతో కలిసి ముందుగా పట్టణంలోని కోదండ రామాలయంలో శ్రీరాముడికి అర్చన చేశారు. జహీరాబాద్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాణిక్‌రావు నాయకులతో కలిసి కేక్ కట్‌చేశారు.

తొలిరోజు ప్రశాంతం

సంగారెడ్డి అర్బన్/మెదక్ అర్బన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు ప్రథమ భాష పరీక్ష ప్రశాంతగా జరిగింది. సంగారెడ్డిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో ఉదయం 9.30 గంటల నుంచి 12.30 వరకు పరీక్ష జరిగింది. తొలిరోజు 79 మందికి 40 మంది హాజరుకాగా 39 మంది గైర్హాజరయ్యారు. 50.63 హాజరు శాతం నమోదైంది. కాగా పరీక్షా కేంద్రాన్ని డీఈవో వెంకటేశ్వర్లు సందర్శించారు. మెదక్‌లో పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో తొలిరోజు 173 మంది విద్యార్థులకుగానూ.. 138 మంది హాజరుకాగా.. 35 మంది గైర్హాజరైనట్లు డీఈవో రాధాకిషన్ తెలిపారు.

చెరువులో ఏర్పాటు చేసిన రోడ్డు తొలగింపు

వెల్దుర్తి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన వెల్దుర్తి పంచాయతీ పరిధిలోని ఎల్కపల్లి గ్రామ శివారులో ఉన్న ఖాన్ చెరువును కబ్జా చేసి అక్రమంగా నిర్మించిన రోడ్డును ఇరిగేషన్ డీఈఈ రాజేందర్ ఎక్స్‌కవేటర్ సహాయంతో మంగళవారం తొలగించారు. వెల్దుర్తికి చెందిన ఆర్ఎంపీ డాక్టర్ నర్సింలు తన వ్యవసాయ పొలానికి వెళ్లేందుకు ఖాన్ చెరువును కబ్జాచేసి రోడ్డును నిర్మించగా సోమవారం రైతులు అడ్డుకుని, తమకు సమాచారం అందించారన్నారు. మంగళవారం చెరువులో నిర్మించిన రోడ్డును తొలగించామని చెప్పారు.

దొంగను పట్టించిన సీసీ ఫుటేజీ

ఐడీఏబొల్లారం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ఏటీఎం కేంద్రాన్ని ధ్వంసం చేసి దొంగతనానికి ప్రయత్నించిన దొంగను పట్టుకున్నారు. ఐడీఏబొల్లారం సీఐ రవీందర్‌రెడ్డి వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన గణేష్ కుటుంబం ప్రవేటు పరిశ్రమలో పనిచేస్తూ ఐడీఏబొల్లారంలో స్థిరపడ్డారు. విలాసాలకు అలవాటు పడిన గణేష్ ఇంటికి దగ్గరలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఏటీఎం కేంద్రంలో గడ్డపార, స్క్రూ డ్రైవర్‌లతో యంత్రాన్ని పగులగొడుతుండగా.. అలారం మోగడంతో పరారయ్యాడు. సీసీ కెమెరా ఆధారంగా గణేష్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

వెల్టూర్‌లో శివపార్వతుల విగ్రహాల ప్రతిష్ఠాపన



శివపార్వతుల ఆలయాన్ని సందర్శించిన కోటిలింగేశ్వర పీఠాధిపతి శివయోగి శివాచార్య స్వామిజీ తదితరులు

సదాశివపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : సదాశివపేట మండలం వెల్టూర్ గ్రామంలో నిర్మించిన ఆలయంలో శివపార్వతుల విగ్రహాల పునఃప్రతిష్ఠ కార్యక్రమాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించనున్నట్టు తంగడపల్లి జంగమయ్యగుట్ట కోటిలింగేశ్వర పీఠాధిపతి శివయోగి శివాచార్యస్వామిజీ తెలిపారు. ఈ నెల 5 నుంచి 8వ తేదీవరకు విగ్రహాల ప్రతిష్ఠాపనలు జరుగుతాయని పేర్కొన్నారు.